నమస్తే తెలంగాణ
మహబూబ్‌నగర్
నారాయణపేట
5 | మహబూబ్‌నగర్, సోమవారం 13 జనవరి 2025 | MAHABUBNAGAR NARAYANPET

కొత్తకోటలో వివేకానందుడి విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

యువతను చైతన్యపర్చిన
మేధావి వివేకానందుడు

- మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

వనపర్తి, జనవరి 12(నమస్తే తెలంగాణ) : ప్రపంచ యువతను చైతన్యపర్చిన మేధావిగా స్వామి వివేకానంద గుర్తింపు పొందారని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని కొత్తకోటలోని వివేకానంద విగ్రహానికి ఆయన పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత పాశ్చాత్య సంస్కృతిని, యోగాను పరిచయం చేసింది వివేకానందుడని, రామకృష్ణ పరమహంస బోధనలతో పరిపూర్ణ విశ్వాసంతో సమాజంలో ఉన్న రుగ్మతలను, మూఢ నమ్మకాలను దూరం చేసి యువతలో ఆత్మస్థైర్యం నింపిన అపర భగీరథుడు అని కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు గట్టు యాదవ్, అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, నాయకులు అశోక్, రమేశ్‌గౌడ్, పరంజ్యోతి, నాగన్న యాదవ్, ప్రేమ్‌నాథ్ రెడ్డి, తిరుమల్, జాత్రునాయక్, రహీం, గిరి, హుస్సేన్ పాల్గొన్నారు.

మాజీ ఎంపీ 'మంద' ఇకలేరు

- నేడు హైదరాబాద్‌లో అంత్యక్రియలు
- శోక సంద్రంలో అలంపూర్ నియోజకవర్గం

అలంపూర్, జనవరి 12 : నాగర్‌కర్నూలు మాజీ ఎంపీ మంద జగన్నాథం గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం రాత్రి నిమ్స్ దవాఖానలో మృతి చెందారు. మంద జగన్నాథం జోగుళాంబ గద్వాల జిల్లా ఇటిక్యాల మండలం, ప్రస్తుత ఎర్రవల్లి మండలం కొండేరు గ్రామంలో పెద్దపుల్లయ్య– మంద సవారమ్మ దంపతులకు 1951 మే 22వ తేదీన జన్మించారు. ఆయన తండ్రి నాగార్జునసాగర్‌లోని ఫైలాన్ కాలనీలో మెకానికల్ విభాగంలో వాచ్‌మెన్‌గా పని చేశారు. తల్లి సవారమ్మ హిల్‌కాలనీలో ఆఫీస్ అటెండెంట్‌గా పనిచేసింది. వృత్తిరీత్యా ఆయన మొదట్లో వైద్య వృత్తిలో కొనసాగారు. మొదటి తెలుగుదేశం పార్టీలో చేరి నాగర్‌కర్నూల్ ఎంపీగా విజయం సాధించారు. పొలిట్‌బ్యూరో సభ్యుడిగా కొనసాగారు. 1996, 1999, 2004, 2009 ఎన్నికల్లో టీడీపీ, కాంగ్రెస్ పార్టీల నుంచి ఎంపీగా పోటీచేసి విజయం సాధించారు. 2014 మలిదశ ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్ అడుగు జాడల్లో నడిచాడు. ప్రత్యేక తెలంగాణ సాధించడంలో పార్లమెంట్‌లో పదివిని సైతం త్యాగం చేసి కీలక పాత్ర పోషించారు. ఆయన సేవలను గుర్తించిన కేసీఆర్ పార్టీ పరంగా బీఆర్ఎస్ పార్టీ ఢిల్లీలో ప్రత్యేక అధికారిగా కెబినెట్ హోదాలో రెండుమార్లు అవకాశం కల్పించారు. మంద జగన్నాథం అకాల మరణం నాగర్‌కర్నూల్ నియోజకవర్గం అందులోని అలంపూర్ అసెంబ్లీ నియోజకవర్గం మొత్తం శోకసంద్రంలో మునిగిపోయింది. అయితే మంద జగన్నాథం భౌతికకాయాన్ని నిమ్స్ దవాఖాన నుంచి హైదరాబాద్‌లోని చెంపాపేట్‌కు తరలించారు. సోమవారం మధ్యాహ్నం 3గంటలకు సంతోష్‌నగర్ శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

గద్వాలలో ముగ్గుల రంగులు కొనుగోలు చేస్తున్న మహిళలు

సంక్రాంతి సందడి

- పట్నం వీడి పల్లెకు చేరిన జనం
- వైభవంగా మూడు రోజుల వేడుక
- ప్రతి ఇల్లు రంగుల హరివిల్లే..

గద్వాల టౌన్, జనవరి 12 : మంచుతెరల నడుమ నులి వెచ్చని రవికిరణాలు వెదజల్లగా.. పుడమి తల్లి పసిడి పంటలు అందివ్వగా.. ప్రకృతి సింగారించుకొని సంక్రాంతికి స్వాగతం పలుకగా.. పట్టు పరికిణీలతో ఆడపడుచుల సందడి.. గాలి పటాలతో చిన్నారుల కేరింతలు ఇలా సరదాలెన్నో సంక్రాంతి మోసు కొచ్చింది. సంక్రాంతి పండుగ వచ్చిందంటే ఊరు వాడా అంతా సంబురాలే. భోగి, సంక్రాంతి, కనుమ పేరిట జిల్లా ప్రజలు మూడు రోజుల పాటు సంబరాలు చేసుకోనున్నారు. పల్లె టుళ్లలో డూడూ బసవన్నలు, హరి దాసులు, పగటి వేషగాళ్లు, ఎడ్లపందెలు, కుర్వ డోళ్ల సందడి మరింత ఆకర్షణీయంగా నిలుస్తాయి. ఇది ముఖ్యంగా రైతుల పండుగ. పంట చేతికొచ్చిన రోజుల్లో సంతోషంగా జరుపుకొనే సంక్రాంతి రైతులకు పెద్ద పండుగగా చెప్పుకుంటారు. అలాగే సూర్యుడు మకర రాశిలో ప్రవేశించే ఈ రోజును పవిత్రంగా భావిస్తారు. ఏడాది కాలంలో ఆరు నెలలు ఉత్తరాయణం అని, ఆరు నెలలు దక్షణాయణమని అందరికి తెలిసిందే.

భోగి ముచ్చట్లు..

సంక్రాంతికి ముందు రోజు భోగి పండుగగా జరుపుకొంటారు. ఈ రోజు సూర్యుడు ధనస్సు రాశిలోంచి మకర రాశిలోకి ప్రవేశిస్తాడు. ఈ రోజున స్వర్గలోకపు వాకిళ్లు తెరుస్తారని నమ్మకం ఉంది. అందుకే ఈ సందర్భాన్ని పురస్కరించుకొని మన రాష్ట్రంలో భోగిగా, రాజస్థాన్‌లో మకర సక్రాత్‌గా, పంజాబ్‌లో హరిగా, నేపాల్‌లో మాఘి సంక్రాంతిగా, థాయిలాండ్‌లో సోంగ్‌క్రన్‌గా, మయన్మార్‌లో థింగ్‌యాన్‌గా, అస్సాంలో బోగ బిహుగా, తమిళనాడులో పొంగల్‌గా, ఒడిశాలో కొత్త సంవత్సరం ప్రారంభంగా భోగి పండుగను జరుపుకోవడం విశేషం.

మకర సంక్రాతి...

నక్షత్రాలన్నింటినీ కలిపి 108పాదాలుగా, 108పాదాలను 12రాశులుగా విభజించారు. ఈ నెలల సూర్యుడు ధను రాశి నుంచి మకర రాశిలో ప్రవేశిస్తాడు అందుకే మకర సంక్రాంతి అంటారు. తెలంగాణ ప్రాంతంలో నువ్వులు, బెల్లం, కలిసి లడ్డులు, నువ్వుల రొట్టెలు, చెగోడీలు, చకినాలు వంటలు తయారు చేసుకుంటారు. అలాగే కూరగాలన్నింటినీ వాయనంగా సమర్పించుకుంటారు. మకర సంక్రమణం నాడు నువ్వుల నూనెలో మహాలక్ష్మి కొలువై ఉంటుందని ప్రతీతి.

కనుమ పండుగ...

మూడు రోజుల పాటు జరుపుకునే సంక్రాంతి పండుగలో కనుమకు ప్రాధాన్యత ఎంతో ఉంది. కనుమ పండుగను పశువుల పండగగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తున్నది. కనుమ అంటే పశువు అని అర్థం. ఏడాది పాటు పొలం పనుల్లో తమకు చేదోడు వాదోడుగా ఉన్న పశువులను పూజించడం ఆనవాయితీ. పశువులను, కొట్టాలను అలంకరిస్తారు. పొంగలిని నైవేద్యంగా సమర్పిస్తారు. అలాగే నేవైద్యాన్ని పొలంలో చల్లి పాడి పంటలు బాగా పండాలని వేడుకోవడం ఆనవాయితీ.

మొదలైన సందడి..

బతుకు దెరువు కోసం దూరప్రాంతాలకు వెళ్లిన వారు సైతం సొంత గూటికి చేరుకుంటున్నారు. బంధువుల, ఆత్మీయుల పలకరింపులతో ఇండ్లన్నీ కళకళలాడుతున్నాయి. వివిధ ప్రాంతాల నుంచి సొంతూళ్లకు తరలిస్తుండడంతో రోడ్లపై భారీగా వాహనాల రద్దీ నెలకొంది. ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ వాహనాలు సైతం గ్రామాలకు కిక్కిరి వస్తున్నాయి. రంగుల కొనుగోళ్లకోసం వచ్చిన మహిళలు, పండుగ సరుకులు కొనడానికి వచ్చిన ప్రజలతో జిల్లా కేంద్రం సందడిగా మారింది.

రూ.20కోట్లకు పైగా ధాన్యం కుంభకోణం..

జోగుళాంబ గద్వాల జిల్లాలో 2021–22 యాసంగికి సంబంధించి సుమారు రూ.20కోట్లకు పైగా ధాన్యం పక్కదారి పట్టడంతో ఇది అప్పట్లో సంచలనంగా మారింది. ఇందుకు సంబంధించి మిల్లర్లపై అధికారులు కేసులు నమోదు చేసి వదిలేశారు. ప్రభుత్వానికి బియ్యం ఇవ్వకుండా లూటీ చేసిన మిల్లులో గద్వాల మండలం కాకులారంలోని శ్రీకృష్ణా రైస్‌మిల్లు, శాంతినగర్‌లోని సూర్యరైస్ మిల్లు, అయిజలోని అన్నపూర్ణ రైస్ మిల్లులు ఉన్నాయి. ధాన్యం కుంభకోణంలో చోటుచేసుకున్న అవినీతిపై అప్పటి సివిల్ సప్లయ్ డీఎం ప్రసాద్‌రావు ఫిర్యాదు చేయగా, ఆయా పోలీస్‌స్టేషన్ల పరిధిలో కేసులు నమోదు చేశారు. కేసులు నమోదు చేసి నాలుగేండ్లు కావస్తున్నా ధాన్యం అక్రమాలకు పాల్పడిన మిల్లర్లపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. అయితే మిల్లర్లపై ఆర్ఆర్ యాక్టుకింద ఆస్తులు జప్తు చేయాల్సి ఉండగా, అధికారులు అలా చేయకుండా మిల్లర్లకు కొమ్ముకాశారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఇదే అదునుగా చూసుకొని 2023–24లో అదే దందా కొనసాగించే పనిలో మిల్లర్లు ఉన్నారు.



2023-24లో 19,138 మెట్రిక్ టన్నులు కేటాయింపు..

2023–24 యాసంగికి సంబంధించి జిల్లాలోని ఏడు రైస్ మిల్లులకు 19,138 మెట్రిక్ టన్నుల ధాన్యం ప్రభుత్వం మిల్లర్లకు కేటాయించింది. దీని విలువ సుమారు రూ.45కోట్లు ఉంటుందని అధికారుల అంచనా. ఇందుకు సంబంధించి 447.456 ఏసీకేల సీఎంఆర్ బియ్యం ప్రభుత్వానికి అందించాల్సి ఉండగా, జనవరి 3వ తేదీ వరకు కేవలం 286 ఏసీకేల సీఎంఆర్ అందించారు, మిగిలిన బియ్యం మిల్లర్లు అందించకుండా కాలయాపన చేస్తున్నారు. ఇంకా మిల్లర్లు 161.456 ఏసీకేల బియ్యం ప్రభుత్వానికి అందించాల్సి ఉంది.

« సీఎంఆర్ పేరిట అక్రమ దందా »

మిల్లర్ల మాయ

- ప్రభుత్వానికి బియ్యం ఇవ్వడంలో జాప్యం
- అధికారుల సహకారంతో అందినకాడికి దోపిడీ
- 2021-22 యాసంగిలో రూ.20కోట్ల బియ్యం గాయబ్
- 2023-24లో రూ.45కోట్ల ధాన్యం కేటాయింపు
- ఇప్పటికీ ప్రభుత్వానికి ఇవ్వని మిల్లుల యజమానులు
- బ్లాక్ లిస్ట్‌లో ఉన్న మిల్లులకు ధాన్యం కేటాయింపు
- విజిలెన్స్ అధికారులకు ఓ ప్రజాప్రతినిధి ఫిర్యాదు
- దాడులు చేసినా వివరాలు వెల్లడించని వైనం

గద్వాల, జనవరి 12 : జిల్లాలో సీఎంఆర్ పేరిట కొందరు మిల్లర్లు అక్రమ దందాకు పాల్పడుతూ అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వం కోట్ల విలువ చేసే ధాన్యాన్ని మిల్లర్లకు ఇచ్చి మరి ఆడించి ఇవ్వాలని ఇస్తే ప్రభుత్వానికి బియ్యం ఇవ్వడంలో మిల్లర్లు జాప్యం చేస్తున్నా ఎవరూ అడిగే దిక్కు లేదు. దీంతో కొందరి సివిల్ సప్లయ్ అధికారుల సహాయంతో కోట్ల విలువ చేసే ధాన్యాన్ని మిల్లర్లు బయటకు అమ్ముకొని ప్రభుత్వానికి అందాల్సిన బియ్యాన్ని ఎగ్గొడుతున్నారు. అధికారులు ఒత్తిడి చేసిన సమయంలో డీలర్ల వద్ద పీడీఎస్ బియ్యాన్ని మిల్లర్లు కొను గోలు చేసి దానిని రీసైక్లింగ్ చేసి తిరిగి ప్రభుత్వానికి ఇస్తున్నారు. ఇది తెలిసిన అధికారులు మిల్లర్లు ఇచ్చే లంచాలకు ఆశపడి వాటిని పాస్ చేస్తున్నారు. 2021–22 యాసంగికి సంబంధించి రూ.20కోట్లకు పైగా విలువైన ధాన్యాన్ని రైస్‌మిల్లర్లు ప్రభుత్వానికి ఇవ్వకుండా దోచేయడం సంచలనంగా మారడంతోపాటు దీనిపై విచారణ చేసి నివేదిక ఇవ్వాలని మంత్రి జూపల్లి అధికారులను ఆదేశించినా ఇప్పటి వరకు విచారణ అతీగతి లేక పోవడంతో మిల్లర్లు ఆడిందే ఆట పాడిందే పాటగా కొనసాగుతున్నది. మిల్లర్లు 2023–24 సంవత్సరం యాసంగికి సంబంధించి ప్రభుత్వం నుంచి ధాన్యాన్ని తీసుకున్నా ప్రభుత్వానికి ఇవ్వడంలో మిల్లర్లు జాప్యం చేస్తున్నారు. వీటన్నింటిపై రాష్ట్రస్థాయి విజిలెన్స్ అధికారులు జిల్లాలోని అన్ని మిల్లులపై ఆకస్మికంగా దాడులు నిర్వహిస్తే తప్పా అసలు నిజాలు బయటపడే అవకాశం లేదు.

కాలయాపన చేస్తున్న మిల్లర్లు..

ప్రభుత్వానికి అందించాల్సిన బియ్యం ఇవ్వకుండా కొంత మంది మిల్లర్లు కాలయాపన చేస్తున్నారు. బీచుపల్లిలోని సాయిశ్రీ ట్రేడింగ్ కంపెనీ ప్రభుత్వానికి మొత్తం 111.528 ఏసీకేల బియ్యం ఇవ్వాల్సి ఉండగా, ఇప్పటి వరకు కేవలం 65 ఏసీకేలు మాత్రమే ప్రభుత్వానికి అందించింది. ఇంకా 46.53 ఏసీకేల బియ్యం ప్రభుత్వానికి ఇవ్వాల్సి ఉంది. కొండపల్లి రోడ్డులోని మణికంఠ రైస్ ఇండస్ట్రీ 104.936 ఏసీకేల బియ్యం ఇవ్వాల్సి ఉండగా, 60 ఏసీకేల బియ్యం ఇచ్చారు. ఇంకా పెండింగ్‌లో 36.48 ఏసీకేలు ఉన్నాయి. జోగుళాంబ రైస్‌మిల్లు బుక్కాపురం రోడ్డు మిల్లు నుంచి ప్రభుత్వానికి 5.898 ఏసీకేలు ఇవ్వాల్సి ఉండగా, ఇప్పటి వరకు ఒక్క ఏసీకే బియ్యాన్ని కూడా ప్రభుత్వానికి ఇవ్వలేదు. అలాగే లక్ష్మీవేంకటేశ్వర మోడ్రన్ రైస్‌మిల్ (దువాసిపల్లి) నుంచి ప్రభుత్వానికి 14.009 ఏసీకేల బియ్యం ఇవ్వాల్సి ఉండగా, కేవలం రెండు ఏసీకేల బియ్యం మాత్రమే అందించారు. ఇంకా ఆ మిల్లు నుంచి 12.01 ఏసీకేల బియ్యం ప్రభుత్వానికి ఇవ్వాల్సి ఉన్నది. కేటిదొడ్డి మండలంలోని కమ్మిడి స్వామి రైస్‌మిల్ యజమాని 48.108 ఏసీకేల బియ్యం ప్రభుత్వానికి ఇవ్వాల్సి ఉండగా, ఇప్పటి వరకు కేవలం 6ఏసీకేల బియ్యం మాత్రమే ఇవ్వగా 42.11 ఏసీకేల బియ్యం పెండింగ్‌లో ఉంచారు. ఈ మిల్లును బ్లాక్ లిస్ట్‌లో పెట్టినప్పటికీ అధికారులు సీఎంఆర్ వడ్లు కేటాయించడం వెనుక మర్మం ఏమిటో అర్థం కావడం లేదు. దీంతోపాటు మూడు రోజుల కిందట దూవా సిరిల్ల శివారులో ఉన్న రైస్ మిల్లు సమీపంలో విజిలెన్స్ అధికారులు 153 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నారు. బీచుపల్లి ఆయిల్ మిల్లులో దొంగలు పడి ధాన్యం ఎత్తుకపోయారని ఫిర్యాదు చేసిన మిల్లు యజమాని కూడా ప్రభుత్వానికి బియ్యం అందించాల్సి ఉంది. దొంగలు పడి ధాన్యం ఎత్తుకెళ్లారనేది కట్టు కథ అని గుసగుసలు వినిపిస్తున్నాయి. అయితే వీరు ప్రభుత్వం కేటాయించిన వరి ధాన్యం అమ్ముకుని పీడీఎస్ బియ్యాన్ని సీఎంఆర్‌గా మార్చే క్రమంలో విజిలెన్స్ అధికారులకు దొరికినట్లు తెలిసింది. ఏడు మిల్లులకు గత యాసంగిలో ప్రభుత్వం ధాన్యం కేటాయించగా, అందులో రెండు మిల్లులు మాత్రమే ప్రభుత్వానికి పూర్తి స్థాయిలో బియ్యం అందించగా, మిగతా ఐదు మిల్లుల నుంచి 161.456 ఏసీకేల బియ్యం రావాల్సి ఉంది. ఈ మిల్లులపై విజిలెన్స్ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

బియ్యం ఇవ్వని మిల్లులపై ప్రజాప్రతినిధి ఫిర్యాదు..

ప్రభుత్వం నుంచి వరి ధాన్యం తీసుకొని ప్రభుత్వానికి బియ్యం సరఫరా చేయని మిల్లులపై జిల్లాకు చెందిన ఓ ప్రజాప్రతినిధి రాష్ట్ర సివిల్ సప్లయ్ అధికారుల తోపాటు, విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. రాష్ట్రస్థాయి విజిలెన్స్ అధికారులు పూర్తిస్థాయిలో విచారణ చేస్తే తప్పా అసలు విషయాలు బయట పడే అవకాశం లేదు.

బీచుపల్లి ఆయిల్‌మిల్లు గోదాంలో ధాన్యం గోల్‌మాల్‌పై విచారణ చేస్తున్న అధికారులు(ఫైల్)

వివేకానందుడిని స్ఫూర్తిగా తీసుకోవాలి

- యువకులు రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలి
- అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వివేకానందుడి జయంతి
- పాల్గొన్న మాజీ మంత్రి లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, ఎస్ఆర్‌రెడ్డి



అలంపూర్‌లో వివేకానందుడి జయంతి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే విజయుడు

అలంపూర్, జనవరి 12 : యువత స్వామి వివేకానందుడిని స్ఫూర్తిగా తీసుకొని ఉన్నతంగా ఎదగాలని అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు సూచించారు. ఆదివారం అలంపూర్ పట్టణంలో స్వామి వివేకానంద యూత్ సొసైటీ ఆధ్వర్యంలో వివేకానంద జయంతిని పురస్కరించుకొని నిర్వహించిన రక్తదాన శిబిరం, హెల్త్‌క్యాంప్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. అంతకు ముందు స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతిఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని యువకులకు పిలుపునిచ్చారు. అనంతరం ఉపన్యాస పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు మెమెంటోలు, ప్రోత్సాహకాలు అందజేశారు. కార్యక్రమంలో యూత్ అధ్యక్షుడు వెంకటేశ్ యాదవ్, కార్యదర్శి సంజీవనాయుడు, పోలీస్ చిన్నయ్య, జితేందర్‌గౌడ్, వెంకట్రామయ్యశెట్టి, శేఖర్‌రెడ్డి, ముస్తఫా, సూరి, మనోహర్, కర్ణ, ప్రశాంత్ పాల్గొన్నారు.



జడ్చర్లలో వివేకానంద విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి లక్ష్మారెడ్డి



భూత్పూర్‌లో నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆల



పేటలో నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఎస్ఆర్‌రెడ్డి

దేశ సంస్కృతిని చాటిచెప్పిన మహనీయుడు..

జడ్చర్ల, జనవరి 12 : దేశ సంస్కృతిని చాటిచెప్పిన స్వామి వివేకానందను యువత ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం జడ్చర్లలోని వాల్మీకి నగర్‌లో స్వామి వివేకానంద జయంతి ఉత్సవాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై స్వామి వివేకానంద విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బాదేపల్లి పీఏసీసీఎస్ చైర్మన్ సుదర్శన్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ పుష్పలత, కౌన్సిలర్లు ప్రశాంత్‌రెడ్డి, ఉమాశంకర్‌గౌడ్, కిశోర్ గౌడ్, చైతన్య, లత, నవనీత కొండల్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రఘుపతిరెడ్డి, నాయకులు మురళి, యాదయ్య, దానిష్, నాగిరెడ్డి, ఇమ్మూ, కృష్ణారెడ్డి, అంజిబాబు, బాలు, భరత్, నిజాం, భరత్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఆదర్శంగా తీసుకోవాలి

భూత్పూర్, జనవరి 12 : వివేకానందుడిని ఆదర్శంగా తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణ పరిధిలోని వివేకానంద విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆల మాట్లాడుతూ వివేకానందుడిని మించిన దేశభక్తుడు లేడన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బస్వరాజ్‌గౌడ్, మాజీ ఎంపీపీ చంద్రశేఖర్ గౌడ్, మాజీ సర్పంచ్ నారాయణగౌడ్, ఆంజనేయులు, వివిధ పార్టీల నాయకుడు సుదర్శన్‌రెడ్డి, మురళీధర్‌గౌడ్, సరోజిరెడ్డి, సత్యయ్య గౌడ్ సత్యనారాయణ, అశోక్‌గౌడ్, వెంకట్ రాజ్, బాల్‌రెడ్డి, మల్లేశ్, పాఠశాల కరస్పాండెంట్ నర్సింహులు ఉన్నారు.

సూక్తులు ఎంతో ప్రభావితం

నారాయణపేట, జనవరి 12 : ప్రతిఒక్కరూ స్వామి వివేకానందునిడి ఆదర్శంగా తీసుకోవాలని, ఆయన సూక్తులు ఎంతో మందిని ప్రభావితం చేశాయని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి అన్నారు. స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని పట్టణంలోని మున్సిపల్ పార్కులో ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు విజయ్‌సాగర్, ప్రధాన కార్యదర్శి చెన్నారెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ జగదీశ్, ప్రతాప్‌రెడ్డి, రాములు పాల్గొన్నారు.

సంకలమద్దిలో పందిగుట్టను పరిశీలిస్తున్న అధికారులు

గుట్టను పరిశీలించిన టాస్క్‌ఫోర్స్

మూసాపేట, జనవరి 12 : మూసాపేట మండలంలోని సంకలమద్ది పందిగుట్ట నుంచి అనుమతి లేకుండా మట్టి తరలిస్తున్నారని 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో ఆదివారం ప్రచురించిన 'జోరుగా మట్టి దందా' కథనానికి జిల్లా అధికారులు స్పందించారు. పందిగుట్టను, అదేవిధంగా మట్టివేసిన రోడ్డును జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం సభ్యులు పరిశీలించారు. ఈ సందర్భంగా టాస్క్‌ఫోర్స్ టీం ఎస్సై శ్రీహరి మాట్లాడుతూ తవ్వకాలపై మైన్స్ ఏడీకి నివేదిక ఇస్తామని తెలిపారు. ఈ విషయమై తాసీల్దార్ రాజు మాట్లాడుతూ మైన్స్ శాఖ నివేదికల ఆధారంగా కాంట్రాక్టర్ చర్యలు తీసుకుంటాయని చెప్పారు.

ఆర్డీఎస్‌లో నిలకడగా నీటి నిల్వ

అయిజ, జనవరి 12 : కర్ణాటకలోని ఆర్డీఎస్ ఆనకట్టలో నీటి నిల్వ నిలకడగా ఉంది. ఈనెల 8న ఆర్డీఎస్ ఇండెంట్‌లో భాగంగా టీబీ డ్యాం నుంచి నీటిని విడుదల చేశారు. ఆదివారం వరకు నీరు చేరాల్సి ఉండగా, ఆనకట్టకు చేరడంలో ఆలస్యమవుతున్నది. ఆర్డీఎస్ ప్రధానకాల్వకు 178 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. 64 క్యూసెక్కులు ఆర్డీఎస్ కన్స్ట్రక్షన్ స్లూయిస్ గుండా దిగువకు ప్రవహిస్తున్నది. ప్రస్తుతం ఆర్డీఎస్ ఆనకట్టలో 4.8 అడుగుల నీటి మట్టం ఉన్నట్లు ఈఈ విజయ్‌కుమార్ రెడ్డి తెలిపారు. నీటి నిల్వలు పడిపోతాయని, టీబీ డ్యాం నుంచి నీటి చేరిక ప్రారంభమైతే ప్రధానకాల్వకు నీటి విడుదల పెంచుతామని ఆయన పేర్కొన్నారు. కర్ణాటకలోని తుంగభద్ర డ్యాంకు ఇన్‌ఫ్లో నిలిచిపోగా, అవుట్‌ఫ్లో 10,557 క్యూసెక్కులుగా ఉన్నది. 105.788 టీఎంసీల గరిష్ఠ సామర్థ్యం కలిగిన డ్యాంలో ప్రస్తుతం 72.107 టీఎంసీల నీటి నిల్వ ఉన్నది. 1,633 అడుగుల పూర్తిస్థాయి నీటి మట్టానికి గానూ ప్రస్తుతం 1623.63 అడుగులు ఉన్నట్లు టీబీ బోర్డు సెక్షన్ అధికారి రాఘవేంద్ర తెలిపారు.